క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సౌజన్య

కొత్తపల్లి: ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సౌజన్య సూచించారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. దోమల వ్యాప్తిని నియంత్రించాలన్నారు. దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు వస్తాయన్నారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఇళ్ల మధ్య డ్రమ్ములు, వాటర్ ట్యాంకులు, సంపులు, ఫ్లవర్ వేజ్‌లు, రుబ్బురోళ్లు, పూల కుండీలు, పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, ఐస్‌క్రీం కప్పుల్లో నీరు నిల్వ ఉండే దోమలు పెరుగుతాయన్నారు. ప్రతిఒక్కరూ ఇళ్ల మధ్య నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

మరిడమ్మ ఆలయంలో హోమం

పెద్దాపురం: పట్టణంలో మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం ఆయుష్ హోమం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కార్యనిర్వహణాధికారి, గ్రామ పెద్దలు, భక్తులు హాజరై మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దాపురం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రారంభించి సమస్యలు పరిష్కరిస్తామని కార్మిక శాఖ మంత్రి ప్రకటించడం చాలా సంతోషదాయకమని సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు అన్నారు. సోమవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశాల సందర్భంగా యాసలపు సూర్యారావు భవన్‌లో సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులందరూ పోరాడి సంక్షేమ బోర్డును సాధించుకున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది కార్మికులు సంక్షేమ బోర్డులో ఉన్నారని గుర్తుచేశారు. పెండింగ్ క్లైమ్‌లు విడుదలకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ముమ్మన శ్రీను, పత్తి నాగబాబు, నీలపాల కష్ణ, మురమళ్ల దుర్గా ప్రసాద్, డొమ్మేటి శ్రీను, గోవిందు, పద్మనాభం పాల్గొన్నారు.

శృంగార వల్లభ స్వామి హుండీ ఆదాయం లెక్కింపు


స్వామి వారి ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పెద్దాపురం: పెద్దాపురం మండలం తిరుపతిలో వేంచేసియున్న శృంగార వల్లభస్వామి హుండీ ఆదాయం రూ. 26,97,425 వచ్చినట్టు నిర్వాహకులు సోమవారం తెలిపారు. స్వామి వారి హుండీలో 103 రోజులకు రూ. 26,97,425, అన్నదాన హుండీలో రూ.6,85,052 మొత్తం రూ.33,82,477 వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌వీ చందన, దేవదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబు నాయుడు, జోకా సత్యనారాయణ, సర్పంచ్, అర్చకులు పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యాలు, కాండ్రకోట చైతన్య గోదావరి బ్యాంక్ సిబ్బంది, స్వామి వారి సేవకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యార్థుల ర్యాలీ


తిరుమాలిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం బాబూరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలందరూ పాఠశాలల్లో చేరాలన్నారు. బడి–ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌బాబు, తూము రౌతు శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, సత్యగౌరి, రాజ్యకళ, పరిమళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం సాయినగర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వెదజల్లు సాగు.. లాభాలు బాగు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- ఖరీఫ్ సాగు పనుల్లో బిజీబిజీ
- నియోజకవర్గంలో 42 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు


పిఠాపురం మండలంలో వెదజల్లు సాగుకు సిద్ధం చేసిన పొలం

పిఠాపురం: రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో పిఠాపురం నియోజకవర్గంలో కొద్దిరోజులుగా వర్షాలు పడటంతో రైతులు ఖరీఫ్ వరిసాగుకు సిద్ధమయ్యారు. పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వెదజల్లు విధానంలో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వల్ల అధిక లాభాలు ఆర్జించడంతో పాటు పెట్టుబడులు తగ్గించవచ్చన్న విషయాన్ని గ్రహించిన రైతాంగం ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

15 వేల హెక్టార్లలో..

పిఠాపురం నియోజకవర్గంలో 42 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తుండగా గతంలో సుమారు 8 వేల హెక్టార్లకు పైగా వరి పంటను వెదజల్లే పద్ధతిలో సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో సుమారు 15 వేల హెక్టార్ల వరకూ వెదజల్లే పద్ధతిలో సాగు చేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. సమయాభావం, కూలీల కొరత, పెరిగిన కూలి రేట్లు తదితర కారణాలతో సంప్రదాయ నాట్లు వేసే పద్ధతిని రైతులు వీడుతున్నారు. గతంలో భారీ వర్షాలు వరదలు కారణంగా పంట సాగులో ఇబ్బందులు తలెత్తగా ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగుకు విత్తనాలను వెదజల్లడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీలైనంత త్వరగా నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు సూచించిన నేపథ్యంలో రైతులు నారు మళ్లు వేసి నాట్లు వేయడం ఆలస్యమవుతుందని భావిస్తున్నారు. దీంతో నేలను దమ్ముచేసి విత్తనాలను చల్లడానికి సిద్ధపడుతున్నారు. విత్తనం మొలకెత్తకపోతే తరువాత తీసుకొనే చర్యలపై రైతాంగం కసరత్తు చేస్తోంది.

పలు గ్రామాల్లో ఇప్పటికే..

పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు ఇప్పటికే వెదజల్లే పద్ధతిలో వరి నాట్లు వేశారు. రైతులు వెదజల్లడం వల్ల పంటచేలో ఎక్కువగా కలుపు ఉండదని, తెగుళ్ల బెడద కూడా తక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వెదజల్లిన పొలాల్లో పక్షులు, క్రిమికీటకాలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కలుపు నివారణకు జాగ్రత్తలు పాటించి ప్రకృతి సహకరిస్తే మంచి దిగుబడుల వస్తాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

> **ఖర్చులు తగ్గుతాయి**
>
> వెదజల్లు విధానంలో ముందుగా నారుమళ్లు వేయాల్సిన పనిలేదు. దీంతో నారుమడి తయారీకి అయ్యే ఖర్చుతో పాటు కూలీలు, దుక్కికి అయ్యే ఖర్చులు మిగులుతాయి. అలాగే ఆకుతీత, నాట్లకు అయ్యే ఖర్చులు సైతం తగ్గుతాయి. సమయాభావం నివారించవచ్చు. నీరు ఎపుడు అందుబాటులో ఉంటే అప్పుడు వెదజల్లే పద్ధతిలో సాగు చేయవచ్చు. వెదజల్లు పద్ధతి ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు.
>
> పి.స్వాతి ఏడీఏ, పిఠాపురం

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో పాటు దశమి పర్వదినం కావడంతో తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున పిఠాపురం మహారాజా గోత్రనామాలతో ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలతో, ఆలయ పుష్కరణిలోని నీటితో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అళ్లకి రాజ్‌గోపాల్ పూజలు నిర్వహించారు.

విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలి


విద్యార్థుల నుంచి సమాచారం సేకరిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థులపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలో పి. వేమవరంలో నేను బడికి పోతా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు సూచించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తూ బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి, వారిని పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేశారు. రాయడం, చదవడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విద్యార్థులకు సూచించారు. ఏడవ తరగతి విద్యార్థులకు గణితం పాఠ్యాంశాన్ని ఎంఈఓ బోధించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి పాఠశాలకు వస్తున్న విద్యార్థులందరూ భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు.

పనసపాడులో ఎంఈఓ 2 పర్యటన

మండల పరిధిలో పనసపాడులోని మండల పరిషత్తు పాఠశాలను ఎంఈఓ– 2 పి.పుల్లయ్య తనిఖీ చేశారు. విద్యార్థుల మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, పాఠ్యాంశాల బోధనను ఆయన పరిశీలించారు.

డంపింగ్ యార్డులుగా చెరువులు


కొత్తపల్లిలో డంపింగ్‌యార్డుగా మారిన ముత్యాలమ్మ చెరువు


ఉప్పాడ చెరువులో వేసిన వ్యర్థాలు

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెరువులు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో కొత్తపల్లి, ఉప్పాడ గ్రామాల్లో చెరువులు డంపింగ్ యార్డులుగా మారాయి. గ్రామాల్లోని చెత్త, వ్యర్థాలను తరలించేందుకు అధికారులు ఒక ప్రదేశాన్ని నిర్ధారించకపోవడంతో సిబ్బంది ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను చెరువులు, రహదారుల పక్కన వేస్తున్నారు. దీంతో చెరువుల్లో నీరు కలుషితమవుతోంది. చెరువుల్లోని కలుషిత నీటికి పశువులు కూడా తాగడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువుల్లో వ్యర్థాలు డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి విడుదల కోసం వినతిపత్రం


పెద్దాపురం ఇరిగేషన్ డీఈకి వినతిపత్రం సమర్పించిన భారత్ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి

పెద్దాపురం: ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని పొలాలాకు సాగునీటిని విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి సోమవారం పెద్దాపురం సాగునీటి పారుదల శాఖ డివిజనల్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేసారు. ఆయకట్టు ప్రాంతంలోని పొలాలకు ఏటా జూన్ 20కి సాగునీటిని విడుదల చేసేవారని, ఈ ఏడాది జూలై వచ్చినప్పటికీ సాగునీటిని విడదల చేయలేదన్నారు. ఆయకట్టులో 58 వేల ఎకరాలకు సంబంధించిన రైతులు సాగునీటి విడుదలపై సందిగ్ధంలో ఉన్నారన్నారు. దీంతో నారుమడులు ఇతర వ్యవసాయ పనులకు సన్నద్ధతలో వెనుకబడ్డారన్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేయడంలో విఫలమయ్యారని, ఇప్పటికైనా స్పందించి ఆయకట్టు రైతులకు ప్రయోజనకరంగా పొలాలకు సాగునీటిని విడుదల చేయాలని కోరారు.

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తత అవసరం


హుస్సేన్‌పురం గ్రామ సభలో సీజనల్ వ్యాధులపై సూచనలిస్తున్న హెల్త్ సిబ్బంది

సామర్లకోట: సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సిబ్బంది సూచించారు. మండల పరిధిలో హుస్సేన్‌పురంలో వారు సోమవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జ్వరాలు, డెంగీ, మలేరియా, అతిసార వ్యాధులు వ్యాపిస్తున్నాయని హెల్త్ సిబ్బంది హెల్త్ సిబ్బంది హెచ్చరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వేడి పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మార్ని నాగమణి అధ్యక్షత వహించగా ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, గ్రామ నాయకులు చల్లా బుజ్జి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రావు, అంగన్‌వాడీలు, యానిమేటర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాక్ సిరామిక్స్ కార్మికుల ఆందోళన


కార్మిక శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న తొలగించిన కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ పరిశ్రమ వద్ద తొలగించిన కార్మికులు చేస్తున్న ఆందోళన సోమవారం కొనసాగింది. 18 ఏళ్లుగా రాక్ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను అన్యాయంగా తొలగించారని నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా రామచంద్రపురంలోని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానికంగా ఉన్న కార్మికులను తొలగించి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను పనిలో పెట్టుకుంటున్నారని వారు ఆరోపించారు. నాలుగు పర్యాయాలు ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించినా న్యాయం జరగలేదని వారన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, క్రాంతి మంగారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప


సామర్లకోటలో పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే రాజప్ప, చైర్‌పర్సన్ తదితరులు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కూటమి ప్రభుత్వంలో పెరిగిన పింఛన్ల పంపిణీ సందర్భంగా స్థానిక ఐదవ వార్డులోని రామాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సహకారంతో పట్టణంలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ గోకిన సునేత్రదేవి, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోలి వెంకటఅప్పారావుచౌదరి, యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.అంతకు ముందు ఎమ్మెల్యే చినరాజప్ప అచ్చంపేట, ఉండూరులో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: మండలంలో తొలిరోజు సోమవారం 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు. ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది, అధికారులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారన్నారు. పింఛన్ల పంపిణీలో గామ సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీలో పిఠాపురం ముందంజ

పిఠాపురం: పింఛన్ల పంపిణీలో కాకినాడ జిల్లాలో పిఠాపురం మున్సిపాలిటీ ముందంజలో ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ కనకారావు సోమవారం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించగా సాయంత్రం 7 గంటలకు 5835 లబ్ధిదారులకు గాను 5584 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మధ్యలో సాంకేతిక సమస్య ఎదురైనా దానిని అధిగమించి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. రూ.4.83 కోట్లకు గాను రూ.3.83 కోట్లు నిధులు పంపిణీ చేశామని ఆయన తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


తునిలో రక్తదానం చేస్తున్న దాతలు

తుని: యువత రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని రోటరీక్లబ్ ఆఫ్ తుని సెంట్రల్ అధ్యక్షుడు చక్కా శ్రీధర్ అన్నారు. స్థానిక బాడవతోట వీధిలోని శుభం ఫంక్షన్ హాలులో సోమవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపు మేరకు ఏర్పాటు చేసిన శిబిరంలో వివేకా కళాశాల, లయోలా విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, పలువురు పట్టణ ప్రముఖులు కలిసి 70 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. రక్తదానం చేసిన దాతలు, ఫంక్షన్ హాలు అధినేత దాడిశెట్టి విష్ణుచక్రానికి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తుని సెంట్రల్ కార్యదర్శి దండెం కృష్ణ, క్యాంపు చైర్మన్ కామేష్, తుని ఎస్సై, దండెం రామకృష్ణ, కంకిపాటి జమీల్, మదర్ బ్లడ్ బాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ శుభ్రత పనుల ప్రారంభం


సామర్లకోట ఫిల్టర్ బెడ్ ట్యాంకును శుభ్రం చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ బెడ్ శుభ్రత పనులను సోమవారం ప్రారంభించారు. మున్సిపాలిటీ సమీపంలోని వేట్లపాలెంలో అతిసార వ్యాధి వ్యాప్తి చెందడంతో మున్సిపాలిటీ తాగునీటిపై మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గణపతినగరంలోని రెండు, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న రెండు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. గోదావరి జలాలను నాగార్జున ఫిల్టరు చెరువులోకి నింపి, ఆ నీటిని శుద్ధి చేసి బెడ్లలోకి నీటిని పంపుతారు. ఈ మేరకు వాటిని శుభ్రం చేయించారు. ఫిల్టర్ ప్లాంట్‌లో మూడు బెడ్లు ఉండటంతో ఒక బెడ్ తరువాత మరో బెడ్‌ను శుభ్రం చేయిస్తున్నామని కమిషనర్ తెలిపారు. క్లారిఫార్ముకులేటర్ శుభ్రంలో భాగంగా గోదావరి జలాలను నేరుగా ఫిల్టర్ బెడ్‌లోని తరలిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు నీటిని కాచి చల్లార్చి తాగాలని ఆయన సూచించారు.

కనకదుర్గమ్మ బంగారు కిరీటానికి అడ్వాన్స్


స్వర్ణకారుడికి అడ్వాన్స్ చెల్లిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మకు బంగారు కిరీటం చేయించడానికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సోమవారం స్వర్ణకారుడికి అడ్వాన్స్ సొమ్ములు చెల్లించారు. అమ్మవారి విగ్రహానికి బంగారం, వజ్రాలు పొదిగిన కిరీటం చేయించడానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు సంకల్పించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో కిరీటం చేయించడానికి నిర్ణయించగా భక్తులు సుమారు రూ.7 లక్షల వరకు నగదు, బంగారం అందించారు. మిగిలిన మొత్తాన్ని కంబాల శ్రీనివాసరావు సమకూర్చి కిరీటం చేయించేందుకు సోమవారం ఆలయంలో అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో రాజమహేంద్రవరానికి చెందిన స్వర్ణకారుడికి అడ్వాన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు, ఆలయ అర్చకుడు వల్లూరి జగన్నాథశర్మ మాట్లాడుతూ సుమారు 250 గ్రాముల బంగారంతో కిరీటం చేయించడానికి నిర్ణయించామన్నారు. శ్రావణమాసం నాటికి కిరీటం సిద్ధమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి తమ్మన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నారాయణమూర్తి విశేష కృషి


పులి నారాయణమూర్తి దంపతులను సత్కరిస్తున్న దేవదాయ శాఖ డీసీ మేడేపల్లి విజయరాజు తదితరులు

బోట్‌క్లబ్: జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి ఎంతో నిబద్ధతతో పని చేశారని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు కొనియాడారు. జిల్లా దేవదాయశాఖాధికారి పని చేసి పదవీ విరమణ చేసిన పులి నారాయణమూర్తి వీడ్కోలు సభ స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించారు. నూతన కాకినాడ జిల్లా ఏర్పడిన తర్వాత తొలి జిల్లా దేవదాయశాఖాధికారిగా నియమితులై అందరికీ అందుబాటులో ఉన్నారన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తొలి తిరుపతి శృంగారవల్లభ స్వామి, సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి దేవస్థానం, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంతోపాటు పలు ఆలయాలు, సత్రాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశారని అన్నారు. ఈ సందర్భంగా డీసీ ఆధ్వర్యంలో పులి నారాయణమూర్తి దంపతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి ఆలయ ఈఓ డీసీ చక్రధరరావు, దేవదాయశాఖ డీసీ కార్యాలయ సూపరింటెండెంట్లు నాగేశ్వరరావు, తోట సుబ్రహ్మణ్యం, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు ఫణికుమార్, సతీష్‌కుమార్ పలు దేవాలయాలు, సత్రాలకు చెందిన ఈవోలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పాటించండి


మెరక చామవరం ఎంపీపీ పాఠశాలలో తరగతి గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 కొండబాబు


ఏలూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రాజబాబు

రౌతులపూడి: నూతన విద్యా విధానాన్ని అనుసరించి ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలను పాటించాలని ఎంఈఓ-2 గాడి కొండబాబు సూచించారు. మండలంలోని మెరక చామవరం ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఐదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు, ఉపాధ్యాయుల బోధన వంటి పలు అంశాలపై విద్యార్థులను ఆరా తీశారు. ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, వర్కుబుక్స్‌ను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీలు

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పాఠశాలలో రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో ఇంటింటా సర్వే చేసి బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ గంగారావు, ఉపాధ్యాయులు తదితరులుపాల్గొన్నారు.